# మొగవాడి కష్టాలు మొగవాడివి!

మా బాబ్జీకి కొడుకు పుట్టాడు. మా పిన్నీ బాబాయి అంతా ఎంతో సంతోషించారు, మనవడు పుట్టినందుకు! అందరికీ మిఠాయి పంచారు సంబరపడిపోతూ! మా బాబ్జీని కంగ్రాచ్యులేట్ చేద్దామని నేనూ మా స్రవంతీ వెళ్లాం! డల్ గా కూర్చున్న బాబ్జీని చూసి "ఏంటలా వున్నావ్?" అంది స్రవంతి!

'స్రవంతీ! నాకు ఆడపిల్ల పుడితే బాగుండేది! కానీ మగపిల్లాడు పుట్టాడు. అందుకే దిగులుగా వుంది!' అన్నాడు. స్రవంతి పగలబడి నవ్వుతూ 'ఆడపిల్ల పుడితే కట్నమివ్వాలనో ఏదో దిగులుపడ్డ వాళ్లని చూశాంగానీ మగపిల్లాడు పుడితే దిగులేమిటి నీ మొహం' అంది.

"ఆడపిల్లకి చదువూ గిదువూ లేకపోయినా ఫరవాలేదు. కానీ మగాడికి చదువబ్బకపోతే చవటకింద జమకట్టరూ! పైగా నాన్ననేవారు 'తన కొడుకు కనీసం తనెంతైనా చదివి సంపాదించకపోతే తనకి అవమానమని! మరి నా కొడుకూ కనీసం నాలాగా ఒక డిగ్రీ అయినా సంపాదించొద్దూ! పాపం! నాలాగే వీడు బాధలు పడతాడేమోనని దిగులుగా వుంది" అన్నాడు. బాబ్జీ కళ్లల్లో నీళ్ల తిరిగాయి. ఆశ్చర్యపోయింది స్రవంతి!

"స్రవంతీ! మా అక్క జీవిత చదువుకోకపోయినా అమ్మా నాన్న ఏమీ అనేవారు కాదు. కానీ నన్ను మాత్రం నానా చీవాట్లూ పెట్టి అక్కడికీ చదవకపోతే గదిలో పెట్టి గడియపెట్టి పుస్తకాల ముందు కూర్చోపెట్టేవారు. అప్పటికీ చదవకపోతే చావబాదేవారు. నేను ఎంత ఏడ్చేవాణ్ణో తెలుసా? అక్కయ్య మాత్రం హాయిగా వుండేది. పైగా అమ్మ ఎప్పుడు చూసినా ఏవో నగలూ నాణ్యాలూ చేయిస్తూ వుండేది అక్కయ్యకి! ఏమైనా అంటే పెళ్లికి పనికొస్తాయని చెప్పేది. అక్కయ్యని గట్టిగా ఎవరైనా ఏమైనా అంటే, 'ఎందుకు దాన్నలా ఆడిపోసుకుంటారు? ఎలాగా అది ఈ ఇంట్లోంచి వెళ్లిపోయే పిల్లే!' అని వాళ్లని మందలించేది! అక్కయ్యెప్పుడూ హాయిగా కొత్తకొత్త నగలతో ఆడుతూపాడుతూ వుండేది ఏ చీకూ చింతా లేకుండా!

. "అమ్మా! అక్కయ్యకి చదువక్కర్లేదా? తను ఎన్ని సినిమాలు చూసినా ఏమీ అనవు. ఆడపిల్ల! చదువుకుని ఉద్యోగాలు చెయ్యాలా? ఊళ్ళేలాలా? చేసుకున్న మొగుడినీ పుట్టిన పిల్లలనీ సరిగ్గా చూసుకుంటే చాలు. కానీ నీకలా కాదుగా! నువ్వు మగాడివి నాన్నా! బాగా చదువుకోవాలి! అందరి మధ్యా శభాష్ అనిపించుకోవాలి! మమ్మల్నందర్నీ చూడాలి! అప్పుడే నీకు మంచి పెళ్ళామొస్తుంది. లేకపోతే రాదు. నీ కసలు పెళ్ళేకాదు. నలుగురూ నిన్ను చూసి నవ్వుతారు. అప్పుడూ నా కెంత బాధగా వుంటుంది చెప్పు?' అనేది. ఆ మాటలో నేను మగాడిని ఏదో ఒకటి చేసి గొప్పగా వుండాలి అనీ ఒకవేళ నాకూ చదువూ సంధ్యా అబ్బకపోతే వార్థి చవట కింద జమకట్టబడతాననీ తేలిపోయింది. దాంతో నాకు చదువు రాదేమో నేనెందుకూ పనికిరాని వాణ్ణవుతానేమోననే భయం నాలో జీర్ణించుకుపోయింది. ఆ భయంవల్ల నేను కష్టపడి చదివినదంతా కూడా మర్చిపోయేవాణ్ణి! పరీక్షలంటే వొణుకు పుట్టేది. దాంతో ఇంట్లో మళ్ళీ రామాయణం జరిగేది. "ఎందుకు పనికొస్తావురా వెధవా? అనో చదువూ సంధ్యారాని దేశదిమ్మరీ అనో నానా రకాల పేర్లతో దండకాలు చదివేవారు. స్రవంతీ! నాకు చిన్నప్పుడు సంగీతమంటే ఇష్టం! నాట్యం అన్నా ఇష్టంగానే వుండేది. ఎప్పుడైనా పాడినా డాన్స భంగిమలు పెట్టినా అంతే అంతే ఆడుకుంటూ కూర్చో! చదువెలాగూ రాదు ఆడంగి వేషాలూ నువ్వూనూ" అనేవారు వెక్కిరిస్తూ! స్రవంతీ! ఆ బాధలన్నీ మళ్ళీ ఈ బుజ్జిగాడు పడడం నాకిష్టంలేదు! హాయిగా ఆడపిల్లగా పుడితే ఎంతో బాగుండేది అనుకునేవాణ్ణి! కనీసం నాకు పుట్టిన బిడ్డైనా ఆడపిల్లైతే బాగుండేది ఈ బాధలేవీ లేకుండా అన్నాడు బాబ్జీ!

అంతవరకూ నవ్వుతూన్న స్రవంతి మొహం రంగు మారింది! చిన్నప్పటినుంచీ చదువుకోకపోతే నువ్వెందుకూ పనికిరావు సుమా! అనే హెచ్చరికతో భయపడిపోయి ఆ భయంతోటే పెరిగిన బతుకతనిది. అందుకే తనలాగా తన కొడుకు బతుకకూడదని కోరుకుంటున్నాడు. అతి మామూలుగా కనిపించే అతని మాటల వెనుక ఎంతో భయంకరమైన ఆవేదన వుంది!' అనుకుంటూ బాబ్జీ కేసి చూసి 'బాబ్జీ! అప్పటికీ ఇప్పటికీ రోజులెంతో మారాయి! ఆడపిల్లకి చదువక్కర్లేదూ, డబ్బుంటే బోలెడంత కట్నమిచ్చి

పెళ్లిచేసెయ్యొచ్చు' అనే కాలం మారింది! ఆడపిల్లా చదువుకోవాలి! అవసరమైతే ఉద్యోగం చెయ్యాలి! అంతేకానీ డబ్బున్నంత మాత్రాన పెళ్ళైపోదు! అలాగే మగాడు కూడా! చదువంటే కాలేజీ చదువులే అక్కర్లేదు! సంగీతంలో డిగ్రీ పొందొచ్చును మగాడు కూడా! అభిరుచి ఏ విషయంలో వుంటే ఆ విషయంలో ప్రావీణ్యతని సంపాదించుకోవచ్చును! కాబట్టి ఈ రోజుల్లో ఆడపిల్లైనా మగపిల్లాడైనా ఒకటే! పిచ్చి పిచ్చి బాధలు పెట్టుకోక సంతోషంగా వుండు. పద! నాకు ట్రీట్ ఇద్దువుగాని!" అంటూ చెయ్యిపట్టి లేపింది స్రవంతి! ★